క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



దౌల్తాబాద్: పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి

దౌల్తాబాద్: గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు గొడుగు శ్రీనివాస్‌ల క్ష్మీతో పాటు 20 మంది కార్యకర్తలు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో నాయకులు భీంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: దౌల్తాబాద్, కోస్గి మండలాల నుంచి పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం హైదరాబాద్‌కు వెళ్లి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రేవంత్ విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

రోహిత్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యే కావడం ఖాయం

యాలాల: రోహిత్‌రెడ్డి రెండోసారి తాండూరు ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా ప్రతి పంచాయతీకి రూ.50లక్షల నిధులు తెచ్చిన ఘనత రోహిత్‌రెడ్డికే దక్కుతుందని, తామంతా ఆయనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులతో లెర్నింగ్ కర్వ్ సిబ్బంది, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులకు చదువు చెప్పేటప్పుడు వివిధ మార్గాలను అనుసరించాలని ఎంఈఓ హబీబ్ అహ్మద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు లెర్నింగ్ కర్వ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, క్రీడా పరికరాలను అందజేశారు. ఇందులో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, స్థానిక ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఆర్య వైశ్యులు

కొడంగల్: మండల పరిధి ఆర్య వైశ్యులు శనివారం హైదరాబాద్‌కు వెళ్లారు. తెలంగాణ ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద దీక్షకు పిలుపునిచ్చారు. దీంతో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన ఆర్య వైశ్యులు తరలి వెళ్లారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ సాధించడానికే దీక్ష చేస్తున్నట్లు కొడంగల్ పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా పేర్కొన్నారు. ఇందులో ఎల్లయ్య గుప్తా, నందారం శ్రీనివాస్ ఉన్నారు.

తొగుట వీర క్షత్రియ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న కుల సంఘం నాయకుడు

కొడంగల్: తొగుట వీర క్షత్రియ సంఘం కుల బంధువుల బలోపేతానికి కృషి చేయనున్నట్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవరకొండ శ్రీనివాస్, పోస లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని చౌడేశ్వరీ దేవాలయంలో కొడంగల్ తాలూకా తొగుట వీర క్షత్రియ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా అంజిలయ్య, కోశాధికారిగా రతీష్, గౌరవ అధ్యక్షుడిగా రూమాండ్ల నర్సింహులు, సంఘటన కార్యదర్శి కొంతం విఠల్, ప్రచార కార్యదర్శిగా మంచాల బాల్‌రాజ్, సలహాదారులుగా హకీం బాల్‌రాజ్, దేవరకొండ రమేష్, వెంకటేశ్‌లను నియమించారు. ఈ సందర్భంగా సంఘం నూతన సభ్యులు మాట్లాడుతూ కుల బంధువుల ఐక్యతకు పాటుపడతామని, సేవా కార్యక్రమాలు నిర్వహించి సంఘానికి గుర్తింపు తెస్తామని వెల్లడించారు.

పౌరహక్కులకు భంగం కలిగించరాదు

బొంరాస్‌పేట: కుల, మత వివక్షలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం నాందార్‌పూర్ ఎస్సీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు వివక్షత సంఘటనలు ఎదురైతే ఫిర్యాదు చేయాలని సూచించారు. కుటుంబ తగాదాలకు పాల్పడకూడదని చెప్పారు.

వణికిస్తున్న విషజ్వరాలు

- పెరుగుతున్న జ్వర పీడితులు
- రోగులతో ఆసుపత్రుల కిటకిట
- కుక్క,పాము కాటు మందుకు కొదవ లేదంటున్న డాక్టర్లు
- సమయపాలన పాటించని పలువురు వైద్యులు

వాతావరణ మార్పులతో జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో పల్లెలు, పట్టణ జనాభా జబ్బుల బారిన పడి మంచం పడుతున్నారు. జ్వర పీడితులతో ప్రభుత్వ ఆసుపత్రులు రద్దీగా ఉండగా.. ఎప్పటిలాగే కొందరు సర్కారు వైద్యులు సమయ పాలన పాటించ లేదు. దీంతో రోగులు ప్రైవేటు దవాఖానాల గడప తొక్కక తప్పడం లేదని, అక్కడ వైద్యం ఖర్చులు భరించలేక పోతున్నామని రోగుల బంధువులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం 'సాక్షి' జిల్లా వ్యాప్తంగా ధర్మాసుపత్రులను విజిట్ చేయగా.. అక్కడి సిబ్బంది పనితీరు, రోగుల అవస్థలు, ఔషధాల కొరత లాంటి అనేక అంశాలు వెలుగుచూశాయి.

– సాక్షి నెట్‌వర్క్



మోమిన్‌పేట: వైద్యుడి రాక కోసం ఎదురు చూస్తున్న రోగులు

పెద్దేముల్: రెండేళ్ల నుంచి ఇక్కడి పీహెచ్‌సీలో ఆయుష్ డాక్టర్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పీహెచ్‌సీలో నొప్పి మాత్రలు తప్ప, అన్ని రకాల మందులతో పాటు పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉన్నాయని స్టాఫ్‌నర్స్ స్వరాజ్ తెలిపారు. ఉదయం 9.20 గంటలకు విధుల్లో స్టాఫ్‌నర్స్ మినహా.. మిగితా వారు సమయానికి రాలేదు. ప్రస్తుత డాక్టర్ బుచ్చిబాబు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పని ఉండటంతో అక్కడికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయుష్ డాక్టర్ శైలజ బదిలీపై వెళ్లగా.. మరో వైద్యున్ని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరపీడితులు అంతంతే..

బొంరాస్‌పేట: మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం 120మంది వరకు రకరకాల జబ్బులతో వస్తుంటారని, అందులో కుక్కకాటు, రోడ్డు ప్రమాదాల కేసులే ఎక్కువగా ఉంటాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల పనితీరు మెరుగ్గా ఉండటం వలన బొంరాస్‌పేట, దుద్యాల మండల పరిధిలో వైరల్ ఫీవర్ కేసులు అంతంత మాత్రమేనని తెలుస్తోంది. నెల రోజుల వ్యవధిలో రెండు పాముకాటు, 10 కుక్కకాటు బాధుతులు చికిత్స కోసం పీహెచ్‌సీకి వచ్చారని, వారికి కుక్కకాటు (ఏఆర్‌వీ), పాముకాటుకు యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) సూది మందు కాగా.. మెరుగైన వైద్యచికిత్సల కోసం తాండూర్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు సిబ్బంది పేర్కొంటున్నారు.



ధారూరు: పీహెచ్‌సీ బయట రోగుల నిరీక్షణ

నిత్యం 70నుంచి 80మంది..

యాలాల: మండల కేంద్రం పీహెచ్‌సీకి నిత్యం పదుల సంఖ్యలో జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులతో వైద్య పరీక్షల కోసం వస్తున్నారని వైద్య సిబ్బంది చెప్పారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మండల పరిధి గ్రామాల నుంచి 70 నుంచి 80 మంది వరకు రోగులు రాగా.. వారికి వైద్య చికిత్సలు అందిస్తున్నామని వెల్లడించారు. అయినప్పటికీ జబ్బు నయం కావడం లేదంటూ రోగులు దవాఖానకు వస్తున్నారు. జబ్బు తీవ్రతను బట్టి ఆసుపత్రిలో చేర్చుకొని చికిత్స అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌సీలో పాము, కుక్క కాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

టైఫాయిడ్ కేసులే అధికం..

ధారూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రోగులు వైద్యం కోసం రాగా.. అదే సమయంలో కుష్టివ్యాధి నివారణపై అవగాహన సమావేశం నిర్వహించడంతో వైద్యం కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించారు. పాము కాటుకు మందున్నా.. ఎక్కువ మంది వికారాబాద్, తాండూర్ పెద్దాసుపత్రులకు వెళ్తుంటారు. కుక్కకాటు బాధితులు రోజూ వస్తుంటారు. కొత్తగా వచ్చిన డాక్టర్ రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఎక్కువగా టైఫాయిడ్ కేసులు వస్తున్నాయి.

వాంతులు, విరేచనాలతో..



పీఎచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

దోమ: కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఫలితంగా జ్వరపీడితులతో ఆసుపత్రులు రద్దీగా ఉంటున్నాయి. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి నిత్యం 100 నుంచి 150 మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారు. మండల పరిధి గ్రామాల నుంచి జ్వరం, దగ్గు, స్కిన్ అలర్జి, వాంతులు, వీరేచనాలతో దవాఖానకు రోగులు వరుస కడుతున్నారు. వీరికి వైద్యులు మెరుగైన చికిత్సను అందించి, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.

పాము కాటుకు మందుంది..



గర్భిణికి న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న స్టాఫ్ నర్స్ శిరియాన

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. మండల పరిధి అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజుకు 50 మందికి పైగా రకరకాల జబ్బులతో చికిత్స నిమిత్తం వస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో ఒళ్లు నొప్పులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతున్న వారే అధికమని, వారికి తగిన వైద్య పరీక్షలు చేసి, ఔషధాలు ఇస్తున్నామని, ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తున్నామని పేర్కొంటున్నారు. పీహెచ్‌సీలో కుక్క, పాము కాటుకు మందులు ఉన్నాయని, విష పురుగులు కరిచిన వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు సమయానుకూలంగా పౌష్టికాహారం తీసుకునేలా సలహాలు సూచనలు ఇస్తున్నట్లు వెల్లడించారు.

ఉదయం 11గంటల వరకు రాని డాక్టర్



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

మోమిన్‌పేట: ఉదయం 9గంటలకు రావాల్సిన డాక్టర్ 11గంటలకు రావడంతో రోగులు నీరసించిపోయారు. అప్పటి వరకు రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండానే ఏఎన్‌ఎం.. జ్వరం, జలుబు మాత్రలు ఇచ్చి పంపించారు. శనివారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఉండటం వలన డాక్టర్ సుజల వచ్చి అందజేశారు. రోజుకు బయటి రోగులు 100 వరకు వస్తున్నారని, అందులో 80మందికి పైగా జ్వర పీడితులే అని, వైద్యులు సమయానికి రాకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నట్లు పలువురు అటెండర్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. 'డాక్టరు లేకపోవడంతో నర్సమ్మనే చూసింది. జ్వరం ఉందని చెప్పడంతో మూడు గోళీలు ఇచ్చింది. జ్వరం వచ్చి రెండు రోజులైంది. గొంతులో గరగరా అంటూ దగ్గు వస్తుంది' అని దుర్గంచెర్వుకు చెందిన శివ్వమ్మ వాపోయింది.

సొసైటీ.. రైతుల బ్యాంక్

పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి



మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

అనంతగిరి: రైతు సంక్షేమానికి పాటుపడతామని శివారెడ్డిపేట్ పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణం కోఆపరేటివ్ బ్యాంకు హాల్‌లో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల కోసం సొసైటీ ఉందని, ఇది వారి బ్యాంక్ అని అన్నారు. పంట రుణం మాఫీ అయిన వెంటనే కార్యాలయం ఎదుట జాబితా ఉంచాలని సూచించారు. రైతుల కోసం టార్పాలిన్ కవర్లు అందజేస్తున్నామని, కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సొసైటీలో పంట రుణం, ఎల్టీ లోన్, గోల్డ్‌లోన్ ఇస్తున్నామని వెల్లడించారు. సొసైటీ సేవలను రైతులు వినియోగించుకొని వృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పాండు, మాజీ చైర్మన్ కిషన్ నాయక్, వ్యవసాయ శాఖ ఏడీ వినోద్ కుమార్, ఏఈఓ అనిల్, కౌన్సిలర్ గోపాల్, మైలార్ దేవరంపల్లి సర్పంచ్ తిరుపతి రెడ్డి, సీఈఓ ప్రభులింగం, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో బంజారాల చేరిక

బొంరాస్‌పేట: కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరారు. బొంరాస్‌పేట మండలం బొట్లోనితండా పంచాయతీ పరిధి పూర్యానాయక్‌తండా, కొత్తూరు పంచాయతీ పరిధి రాముానాయక్ తండాకు చెందిన బంజారాలు శనివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారితో వార్డు సభ్యుడు విఠల్ నాయక్, విశాల్, రాజు, రవి, చందర్, పూల్‌సింగ్, అనిల్, నరేశ్, బుగ్యా, రమణిబాయితో పాటు 25మంది ఉన్నారు. ఇందులో జెడ్పీటీసీ అరుణ దేశు చవాన్, వైస్‌ఎంపీపీ శ్రావణ్, మాజీ వైస్ ఎంపీపీ శేరినారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులు దేశ్యానాయక్, యాదగిరి ఉన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

దోమ: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్లతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంక్షేమం, గోల్డ్‌లోన్, రుణమాఫీ, సబ్సిడీ విత్తనాల సరఫరాపై సీఈఓ యాదగిరితో కలసి చర్చించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మళ్లీ రుణం పొందేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రాథమిక సహకార సంఘంలో మొత్తం 1,469 మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని, అందులో రూ.526.76 లక్షల రుణాలను రైతులకు ఇచ్చిందని పేర్కొన్నారు. రుణమాఫీకి 1,151 మంది రైతులు అర్హులు కాగా, అందులో ఇప్పటి వరకు రూ.368.76 లక్షలు ప్రభుత్వం రుణ మాఫీ చేసిందని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని చెప్పారు. అసరమైన వారికి తక్కువ వడ్డీతో రుణాలను చెల్లిస్తూ గోల్డ్‌లోన్ ఇస్తుందని పేర్కొన్నారు. రైతులు పీఏసీఎస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్లు ఉన్నారు.

లాభం లేకున్నా.. యూరియా విక్రయిస్తున్నాం

- రైతు సంక్షేమానికి పాటుపడుతున్నాం
- పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

ధారూరు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి లాభం రాకున్నా రైతులకు సేవ చేసేందుకే యూరియాను విక్రయిస్తున్నామని చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. సంఘం ఆవరణలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో సంఘానికి లాభం చేకూరుతుందని, మరో మూడు కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని కలెక్టర్‌ను కోరతామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి, సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. సంఘంలో అర్హులైన 2,060 మంది రైతుల జాబితాను రుణమాఫీ కోసం పంపించగా 1,360 మందికి మాఫీ వర్తించిందన్నారు. మాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజునాయక్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, సీఈఓ నర్సింహులు, మండల ఏఓ రూాన్సిలక్ష్మి, మండల మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి శూన్యం

- నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలాం
- ఫార్మేషన్ రోడ్డు వేయించినా డబ్బులివ్వని జెడ్పీటీసీ
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఫైర్
- ప్రతి జీపీకి రూ.15 లక్షల వరకు ఇచ్చాం: జెడ్పీటీసీ



సమావేశంలో సభ్యులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్పల్లి: 'గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. నిధులు లేక, సంక్షేమ పనులు చేపట్టలేక ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు' అని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మధుకర్ ఎజెండా అంశాలను చర్చించగా.. బూచన్‌పల్లి ఎంపీటీసీ బాల్‌రెడ్డి కలగ జేసుకొని ఎంపీపీ లేనందున వైస్ ఎంపీపీ మాత్రమే సభకు అధ్యక్షత వహించాలని, మధుకర్ అధ్యక్షత వహించడం సరికాదని హితవు పలికారు. తాము లేవనెత్తిన అంశాలకు వైస్ ఎంపీపీ లేదా అధికారులు సమాధానం చెప్పాలని, మీరెందుకు కలగ చేసుకుంటున్నారని జెడ్పీటీసీని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ నుంచి మండలానికి రూ.4 కోట్ల వరకు నిధులు వెచ్చించినా తమకు రూ.5 లక్షల నిధులు కూడా ఇవ్వలేదని జెడ్పీటీసీపై ఎంపీటీసీ అసహనం వ్యక్తం చేశారు. సొంత డబ్బులు ఖర్చుపెట్టి ఫార్మేషన్ రోడ్డు వేయిస్తే.. అధికార పార్టీకి చెందిన నాయకులు.. భూమి తమదంటూ పనులకు అడ్డు తగులుతున్నారని ఆరోపిస్తూ.. ఎంపీటీసీ తహసీల్దార్ గణేశ్ దృష్టికి తెచ్చారు.

రూ.1.80కోట్లే వచ్చాయి..

రెండు రోజుల్లో సర్వేయర్‌ను పంపించి ఆ భూమిని సర్వేచేసి, రోడ్డు పనులు జరిగేలా చూస్తామని తహసీల్దార్ గణేశ్ చెప్పారు. అనంతరం జెడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి తమకు రూ.4 కోట్లు రాలేదని, కేవలం రూ.1 కోటి 80 లక్షలు మాత్రమే వచ్చాయన్నారు. ఎంపీటీసీ పరిధి గ్రామాలకు రూ.10 నుంచి 15 లక్షల వరకు నిధులు ఇచ్చామని ఆయన స్పష్టం చేయగా.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ బాల్‌రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకులు కృష్ణారావు, ఎంపీఓ మహేశ్‌కుమార్ ఇరువురిని సముదాయించారు.

పక్షం రోజుల్లో రుణమాఫీ డబ్బులు

వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని జెడ్పీటీసీ మధుకర్.. ఏఓ వసంత దృష్టికి తేగా.. పరిహారం రెండు విడతల్లో వస్తుందని ఆమె చెప్పారు. రుణమాఫీ డబ్బులు కొందరికి రాలేదని, మరో పక్షం రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిషత్ దుకాణ సముదాయానికి సంబంధించిన అద్దె డబ్బులు కొందరు చెల్లించడం లేదని, ఆ డబ్బులు వచ్చేలా చూడాలని, మండలంలో కొనసాగుతున్న అక్రమ వెంచర్లను గుర్తించి, నిర్మాణ పనులను ఆపేలా చర్యలు చేపట్టాలని ఏంపీఓ మహేశ్‌కు చెప్పారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ఎజెండా అంశాలను సభలో చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దార్ గణేశ్, ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకుడు కృష్ణారావు, కోఆప్షన్ సభ్యుడు సోయెల్, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, ఎంఈఓ విద్యాసాగర్ ఉన్నారు.

నేడు సాయన్న విగ్రహావిష్కరణ

కుల్కచర్ల: పండుగల సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం చౌడాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ కోరారు. శనివారం చౌడాపూర్ మండల కేంద్రం ప్రధాన చౌరస్తాలో సాయన్న విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివారం పరిగి పట్టణంలో సాయన్న విగ్రహ ఆవిష్కరణకు ముదిరాజ్‌లు తరలిరావాలని కోరారు. ఇందులో సంఘం నాయకులు ఉన్నారు.

క్రమశిక్షణ అవసరం

దోమ: ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ అవసరమని, క్రమ శిక్షణతో ముందుకు సాగితే ఉన్నతమైన స్థానాలను అధిగమిస్తారని విశిష్ట అతిథులు భాస్కరయోగి, విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రిన్సిపాల్ మంజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగతోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నప్పటి నుంచే క్రమ శిక్షణ అలవర్చుకుంటే ఉన్నతమైన స్థానాలను అధిగమిస్తారని చెప్పారు. పెద్దలను గౌరవిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందులో అధ్యాపకుడు శ్రీధర్ ఉన్నారు.

అసైన్డ్ భూములకు పంట రుణం ఇవ్వాలి

- సొసైటీ పరిధిలో రూ.2.24 కోట్ల రుణమాఫీ
- తక్కువ వడ్డీకే బంగారు రుణాలు
- సర్వసభ్య సమావేశంలో చైర్మన్ సురేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సురేందర్‌రెడ్డి

యాలాల: పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములకు ప్రభుత్వం పంట రుణాలు ఇచ్చేలా సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్మానం చేశామని, ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని సొసైటీ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మట్లాడారు. నిరుపేదలకు ప్రభుత్వం గతంలో అసైన్డ్ భూములను కేటాయించిందని, అప్పట్లో ఆ భూములపై రైతులు పంట రుణాలు పొందారని, వారిలో చాలా మందికి ప్రస్తుతం రుణమాఫీ వర్తించినప్పటికీ అసైన్డ్ పట్టాదారులకు కొత్తగా పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఇదే విషయమై రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు.

వారం రోజుల్లో రుణం..

సొసైటీ పరిధిలో వందకు రూ.80 పైసల వడ్డీతో బంగారు రుణాలు అందజేస్తున్నామని, గతంలో మాదిరిగా కాకుండా 10 గ్రాములు(తులం) బంగారానికి రూ.40వేలు రుణం రూపంలో ఇస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. సొసైటీ పరిధిలో గతంలో పంట రుణాలు తీసుకున్న వారికి రూ.2.24 కోట్ల మేర పంట రుణం మాఫీ అయిందని, అవసరమైన వారికి వారం రోజుల్లో రూ.44 లక్షల మేర కొత్తగా రుణాలు ఇచ్చామని వెల్లడించారు.

అందుబాటులో యూరియా

నాబార్డు కింద గతంలో సొసైటీకి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయని, వాటిలో రూ.2.50 కోట్లతో సొసైటీకి గోదాం, రైసుమిల్లుల నిర్మాణం చేపడుతున్నామని, త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తామని చైర్మన్ తెలిపారు. రూ.40లక్షలతో సొసైటీ ఆవరణలో కొత్త భవనం, స్ట్రాంగ్ రూం నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచలేక పోయామని, రానున్న సీజన్‌లో ఆ సమస్య లేకుండా చేస్తామని చెప్పారు. మాజీ చైర్మన్ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వెంకటయ్య, సంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, సొసైటీ సీఈఓ వేణు, ఆడిటర్ అజ్మత్, స్టాఫ్ అసిస్టెంట్ మల్లేషం, వెంకట్ ఉన్నారు.

ఆరు గంటలు.. రెండే సంచులు



రైతు సేవా సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

- రైతులను వెంటాడుతున్న ఎరువుల కటకట
- మొన్న ధారూరులో, నిన్న పెద్దేముల్‌లో అన్నదాతల అరిగోస

పెద్దేముల్: ప్రతియేటా అన్నదాతలకు ఎరువుల సమస్య తప్పడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా.. ఎరువుల కోసం అల్లాడుతూనే ఉన్నారు. శుక్రవారం ధారురులో పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల తోపులాట జరగగా.. శనివారం పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం వద్ద అదే సీన్ రిపీట్ అయింది. యూరియా లారీ రావడం.. ఒక రోజు ముందు వర్షం పడటంతో శనివారం ఉదయం 7గంటలకు ఎరువుల కోసం ఎఫ్‌ఎస్‌సీఎస్ ఎదుట రైతులు బారులు తీరారు.

పట్టించుకోని అధికారులు

ఆరు గంటల పాటు ఎరువుల కోసం నిరీక్షించిన తమకు రెండు బస్తాల ఎరువు తప్ప ఒక్క సంచికూడ ఎక్కువ ఇవ్వక ఇవ్వడం లేదని రైతులు అధికారులపై మండి పడ్డారు. ప్రభుత్వం ఎరువుల సమస్య లేదని చెప్పడం, తాము చాంతడంత పొడవునా లైనుకట్టినా ఎరువు దొరకడం కష్టంగా మారిందని, ఈ సమస్యపై అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఎకరాకు మూడు, నాలుగు సంచుల యూరియా కావలసి ఉండగా.. రెండు బస్తాలు ఇస్తే ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇదే క్రమంలో గొడవ జరగా.. సంఘం మేనేజర్ మురళీగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఆధ్వర్యంలో ఎరువుల టోకన్లు అందజేశారు. ఇదే విషయమై మేనేజర్ మురళీగౌడ్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం సరఫరా చేసిన ప్రకారం రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.